క్లుప్తంగా

అజ్మీరు శ్రీనివాసరావుకు సత్కారం



మక్కపేట(వత్సవాయి): జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శిగా ఎన్నికైన అజ్మీరు శ్రీనివాసరావు దంపతులను సుగాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుగాలి సంఘ పెద్దలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని శ్రీనివాసరావును కోరారు. పేదసుగాలీలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎల్ఐసీ కోటయ్య, అజ్మీరు వీరభద్రం, శ్రీనివాసరావు, భూక్యా కృష్ణ, సీఆర్పీ రాంప్రసాద్, ధారావతు నాగేశ్వరరావు, నవీన్, కిరణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలపై ఉక్కుపాదం : సీఐ



నందిగామ టౌన్: గంజాయి, మాదకద్రవ్యాలతోపాటు ఇసుక, గ్రావెల్, మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపుతామని నందిగామ టౌన్ సీఐ వైవిఎల్ నాయుడు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు. ముఖ్యంగా అక్రమ వ్యాపారులపై చర్యలు తీవ్రవన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తమ వంతు కృషిచేస్తామని తెలిపారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలు సీజ్ చేయటంతోపాటు కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ పండుదొర, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇనుప రాడ్‌తో దాడికి పాల్పడిన ముగ్గురిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లికార్జునపేటకు చెందిన జీవన్‌కుమార్ తన బాబాయితో కలిసి ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి నైనవరం ఫ్లెవైవర్ సమీపానికి వెళ్లాడు. ఆ సమయంలో రోడ్డుపై ఉన్న ముగ్గురు వ్యక్తులు జీవన్‌కుమార్, అతని బాబాయిని ఆపి ఇక్కడ మీకేం పని అని ప్రశ్నించారు. దీంతో జీవన్‌కుమార్ తన స్నేహితుడైన మణికంఠకు ఇంటి తాళం ఇచ్చేందుకు వచ్చామని చెప్పాడు. ఆ ముగ్గురు మణికంఠ ఇల్లు చూపించాలని అడిగారు. దీంతో జీవన్‌కుమార్ తన స్నేహితుడు ఉండే మణికంఠ ఇల్లు చూపించగా, వారు ఘర్షణకు దిగారు. మద్యం మత్తులో ఉన్న సురేష్, జోజి, నేపాల్ అనే వారు ఇనుప రాడ్ తీసుకుని జీవన్‌కుమార్‌పై దాడికి పాల్పడగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి కనిపించడం లేదని ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహంతిపురం జలాల్ వీధికి చెందిన మహ్మద్ షఫీ కుమార్తె ఎంబీసీ చదివి నలంద స్కూల్‌లో చేస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె ఓ యువకుడిని ఇష్టపడుతున్నట్లు తండ్రికి చెప్పింది. దీంతో తండ్రి స్కూల్ వద్దని చెప్పి, ఇంటి వద్దే ఉన్న మోడరన్ స్కూల్‌లో జాయిన్ కావాలని చెప్పాడు. దీంతో 14వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి ఆమె తిరిగి రాలేదు. దీనిపై ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వివాహిత అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపాలెం మర్రిచెట్టు సెంటర్‌కు చెందిన పుసుపులేటి గౌతం ట్రావెల్స్ నడుపుతున్నాడు. రెండేళ్ల క్రితం ఎం. అఖిలను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె డిగ్రీ వరకు చదువుకుంది. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌లో రికవరీ ఏజెంట్‌గా ఆమెకు జాబ్ వచ్చింది. దీంతో గౌతం తన భార్యను హైదరాబాద్ ఉద్యోగానికి పంపించాడు. అక్కడికి వెళ్లిన తర్వాత ఆమెకు మరో యువకుడితో పరిచయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గౌతం తన భార్యను ఉద్యోగం మానిపించి ఈనెల ఆరో తేదీన ఇంటికి తీసుకువచ్చాడు. గురువారం ట్రావెల్స్ పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య ఇంట్లో లేదు. చుట్టుపక్కల వెదికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో గౌతం తన భార్య కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ



ప్రత్యేకాలంకరణలో శ్రీతిరుపతమ్మ అమ్మవారు



వత్సవాయిలో కరెన్సీ నోట్ల అలంకరణలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



పేటలో శాకంబరీ అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



నకాశిబజారులో ధనలక్ష్మి అలంకరణలో శ్రీకనకదుర్గ అమ్మవారు



నందిగామలో వరలక్ష్మీ అలంకారంలో వాసవీ అమ్మవారు

పెనుగంచిప్రోలు: శ్రావణమాస రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించగా, భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు వారి గృహాల్లో లక్ష్మీదేవిని విశేషంగా అలంకరించుకుని విశేషపూజలు చేయడంతోపాటు వరలక్ష్మి వ్రతం ఆచరించారు. మహిళలు ఒకరికొకరు పసుపుకుంకుమ, పండ్లు, పూలు, గాజులు, జాకెట్ ముక్కలు, చీరలు ఇచ్చిపుచ్చుకున్నారు.

కరెన్సీ నోట్లతో అలంకరణ..

కంచికచర్ల: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు శుక్రవారం విశేష పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వాసవి కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొట్టుముక్కల అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని భక్తులు రూ.4.40లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించుకుని ముత్తైదువులకు భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. వత్సవాయిలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని కరెన్సీనోట్లతో అలంకరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు..

జగ్గయ్యపేట: శ్రావణ మాస రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలోని ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు, కోటిలింగాలలోని భవానీ అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. చిల్లకల్లు లోని గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో సురుగుల దుర్గమ్మ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస శుక్రవారం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక అద్దాల బజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పనగర్ అయ్యప్పస్వామి ఆలయంలోని అష్టలక్ష్మి సహిత వైభవలక్ష్మి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గొట్టుముక్కలలో కరెన్సీనోట్ల అలంకరణలో అంకమ్మతల్లి

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రావణమాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రావణమాస రెండో శుక్రవారం సందర్భంగా ఆయా ఆలయాలలో వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు వేకువజామునే పుణ్య స్నానాలాచరించి ఆయా ఆలయాలలోని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అల్లూరులోని సీతారామచంద్రస్వామి వారి ఆలయం, జుజ్జూరులోని నరసింహస్వామి ఆలయాలతోపాటు ఆయా ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చనలు చేశారు.

నందిగామ పట్టణంలో..

నందిగామ టౌన్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వర స్వామివారి ఆలయంలోని శుకశ్యామలాంబ అమ్మవారు, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాలతోపాటు మండలంలోని పల్లగిరి గట్టుపై త్రిశక్తిపీఠంలో వేంచేసియున్న త్రిమాతలను అర్చకులు వరలక్ష్మీదేవిగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయాలలో మహిళలకు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలకు గాజులు, పూలు, పండ్లు, పసుపుకుంకుమలను అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



చిల్లకల్లులో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



పేటలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

కాల్వల్లో తూటుకాడ తొలగించాలని ఎమ్మెల్యేకు వినతి



మెయిన్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

బలుసుపాడు(జగ్గయ్యపేట): మండలంలోని బలుసుపాడు గ్రామంలోని సాగునీటి కాల్వల్లో తూటుకాడ తొలగించాలని రైతులు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌కు శుక్రవారం విన్నవించారు. గ్రామంలో మెయిన్ కెనాల్ కాల్వను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు డీవీఆర్ బ్రాంచ్, అనుమంచిపల్లి కాల్వల నుంచి సాగు నీరు వస్తోందని, కాల్వల్లో తూటుకాడ ఉండటంతో సాగునీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేదని తూటుకాడ తొలగించాలని రైతులు కోరారు. మెయిన్ కెనాల్‌కు కూడా నీరు సక్రమంగా రావడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ కాల్వల్లో పూడిక తీయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రతిభచూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు









కలెక్టర్ సృజన చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జగ్గయ్యపేట డీటీ నాగరాజు, గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత, ఏడీఏ భవాని, ఆర్టీసీ కండక్టర్ పసుపులేటి శ్రీనివాసరావు



వార్డెన్ విజయదుర్గ



ఎంపీఈవో హేమలత

జగ్గయ్యపేట అర్బన్, నందిగామ టౌన్ : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు చెందిన ఉద్యోగులకు స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని, డిప్యూటీ తహసీల్దార్ నీలం నాగరాజు, బలుసుపాడు రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీసుజాత, ఆర్టీసీ కండక్టర్ పసుపులేటి శ్రీనివాసరావు, నందిగామ బాయ్స్ హాస్టల్ వార్డెన్ విజయదుర్గ, అనాసాగరం ఎంపీఈవో హేమలత విధినిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి కలెక్టర్ జి.సృజన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ప్రశంసాపత్రాలను అందుకున్న ఉద్యోగులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మాజీ విప్ సామినేని ఉదయభాను, మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, రెవెన్యూ, వ్యవసాయ, ఆర్టీసీ, సోషల్ వెల్ఫేర్‌తోపాటు ఆయాశాఖల ఉద్యోగులు అభినందించారు.

వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి



న్యాయవాది హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్లు న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. అమోధ్య నగర్‌లోని వాయిద్యకళాకారుల సంఘ కార్యాలయంలో వాయిద్య కళాకారుల సమ్మేళనం, కళాకారుల ఆత్మీయ సమావేశం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని అనేక దేవాలయాల్లో వాయిద్య కళాకారుల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. కళాకారులు ఐక్యంగా పనిచేయాలని అప్పుడే విజయాలు సాధించగలమని తెలిపారు. ఐక్యంగా ఉండటం ద్వారానే అభివృద్ధిని సాధించగలమన్నారు. వాయిద్య కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యలమందరావు మాట్లాడుతూ న్యాయ సలహాలకోసం న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తాను నియమించామని తెలిపారు. మావేశంలో కార్పొరేటర్ రామ్మోనరావు, సంస్థ సభ్యులు సూరవరపు నాగరాజు, లంక మహేష్, ఆకునూరు సుబ్బారావు, సీతయ్య, రఘునాథ్, కేవీ రామారావు పాల్గొన్నారు. జిల్లా నుంచి వచ్చిన వాయిద్య కళాకారుల బృందాలు వాగ్గేయకార కీర్తనలను పలికించారు. అనంతరం హజరత్తయ్యగుప్తాను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

హైవే వెంబడి రసాయన వ్యర్థాలు





షేర్‌మహ్మద్‌పేట వద్ద రోడ్డు వెంబడి వదిలిన వ్యర్థాలు, కాలిన భూమి

ఆందోళనలో రైతులు

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట అడ్డ రోడ్డు నుంచి అనుమంచిపల్లి గ్రామం వరకు ఉన్న 65వ నంబరు జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా రసాయన వ్యర్థాలు పడేస్తుండటంతో రైతులు, ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజులుగా రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు ప్రత్యేక ట్యాంకర్‌ల ద్వారా ఈ రసాయన వ్యర్థాలను తీసుకువచ్చి రోడ్డు వెంబడి పంటపొలాల మధ్యన వదులుతున్నారు. తెల్లవారు చూసేసరికి ఆ ప్రాంతం దుర్వాసనతోపాటు కాలిపోయినట్లు కనిపిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. చిల్లకల్లు సమీపంలోని టోల్‌ప్లాజా సిబ్బంది రహదారి వెంబడి గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

పలువురు ఎస్ఐల బదిలీ

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం సీఏఆర్‌లో ఉన్న ఎస్.నరేష్(నందిగామ ట్రాఫిక్)కు బదిలీ అయ్యారు. వీఆర్‌లో ఉన్న జి.అనిల్(వీరులపాడు), బొనగిరి రాజు(కంచకచర్ల-1) పి.నాగకళ్యాణి (కంచకచర్ల మహిళా ఎస్ఐ), జి.రాజు(జగ్గయ్యపేట-1), బి.వెంకటేశ్వరరావు(జగ్గయ్యపేట-2)కు, ఎం.ఎస్.కె.అర్జున్(పెనుగ్రంచిప్రోలు),పి.ఉమామహేశ్వరరావు(వత్సవాయి) సేష్టన్‌కు బదిలీ అయ్యారు. నందిగామ టౌన్ నుంచి ఎం.దుర్గామల్లేశ్వరరావు చందర్లపాడు స్టేషన్‌కు, కృష్ణా జిల్లా పెడన నుంచి టి.సూర్యశ్రీనివాస్ చిల్లకల్లు స్టేషన్‌కు, కంచికచర్ల నుంచి యు.హైమావతి మాచవరం స్టేషన్‌కు, చందర్లపాడు నుంచి ఆర్.ధర్మరాజు గుణదలకు, చిల్లకల్లు నుంచి వి.సతీష్ కృష్ణలంకకు, వత్సవాయి నుంచి బి.అభిమన్యు కృష్ణలంక స్టేషన్‌కు, జగ్గయ్యపేట నుంచి ఎం.సూర్యభగవాన్ విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్ స్టేషన్‌కు, నందిగామ టౌన్ నుంచి ఎం.పండుదొర నున్న స్టేషన్‌కు, జగ్గయ్యపేట నుంచి ఎ.పద్మారావు విజయవాడటు టౌన్‌కు బదిలీ అయ్యారు. వీరులపాడు ఎస్ఐ మహాలక్ష్మణుడును వీఆర్‌కు పంపించగా, పి.ఎస్.వి. సుబ్రహ్మణ్యం(కంచికచర్ల)ను ఏలూరు రేంజికి సరెండర్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.

రంజింపజేసిన వీణాగానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన ఎస్. సుజాత బృందం వీణాగానం భక్తులను రంజింపజేసింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఎస్.సుజాత బృందం పలు కీర్తనలను వీణపై మృదుమధురంగా గానం చేశారు. సుజాతకు ఎన్ఎస్ కల్యాణరావు, హరిబాబు చక్కటి సహకారం అందించారు.

సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఫోరం ఫర్ ఆర్టిస్ట్ విజయవాడ ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని ఎంబీవీకే ఆడిటోరియంలో జయహో భారత్ ఆర్ట్ కాంటెస్ట్ పేరుతో గురువారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరిల్లో బహుమతులను పొందారని పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు చెప్పారు. విజేతలను కళాశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. సూపర్ సీనియర్స్ విభాగంలో పురోగమన వైతాళికుల పొట్రేట్ చిత్రాలు అనే అంశంలో బి.అర్జున్ సుతర్ ద్వితీయ బహుమతి, బీట్ బాక్సింగ్ ప్రదర్శనలో ఎన్.గోపి మనోజ్ బహుమతి పొందారని తెలిపారు. మరికొంత మంది ప్రతిభ చూపి ప్రోత్సాహక బహుమతులు పొందారని పేర్కొన్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ప్రధాన డ్రైయిన్లలో పూడికతీత

నందిగామ టౌన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఫణి శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లోని ప్రధాన డ్రెయిన్లలో శుక్రవారం పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఏడు, తొమ్మిది వార్డుల్లోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీసి సిల్ట్‌ను తొలగించినట్లు తెలిపారు. ప్రజలు కూడా చెత్తాచెదారాన్ని మురుగు కాల్వల్లో, రోడ్లపైకి వేయకుండా విధిగా చెత్తకుండీలను వినియోగించాలని కోరారు. మురుగు కాల్వల్లో నీరు పారుదల సజావుగా సాగకుండా అడ్డుపెట్టే పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: అన్న క్యాంటీన్ పేదల ఆకలిని తీర్చే అక్షయపాత్ర అని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని చిల్లకల్లు రోడ్డు కమలా సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాంతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నెట్టెం రఘురాం మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రూ.5లకే టిఫిన్, భోజనంతో కూలీలు, కార్మికులు, పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతిపూట 300మంది పేదల ఆకలి తీరుతుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ కూటమి నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు, క్యాంటీన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

జగ్గయ్యపేట అర్బన్ : మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాక్ యార్డు నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మణికంఠరెడ్డి శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికి, వారి ట్రాక్టర్లకు అనుమంచిపల్లి ఇసుక స్టాక్ యార్డులో ఇసుకను జారీ చేయడం లేదు. దీంతో వారు అనుమంచిపల్లి స్టాక్ యార్డు వరకు వచ్చి వారి ట్రక్కులను ఏపీకి చెందిన ట్రాక్టర్లకు అమర్చి వారితో లోడు చేయించి, ఆ తరువాత వారి ట్రక్కులను వెనుకకు తీసుకుని వాటిని తమ ట్రాక్టర్లతో రాష్ట్రానికి తరలిస్తున్నారు. ఈ విధంగా చేసినందుకు ఏపీ రాష్ట్రానికి చెందిన ట్రాక్టర్లకు ట్రక్కుకు రూ.500 ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు తెలంగాణలోని ఖమ్మంకు ఇసుకను రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. ఐదు టన్నుల ఇసుకతో కూడిన ట్రాక్టర్‌ను కూడా ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకుని చిల్లకల్లు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ముగిసిన మోక్షారోహణ మహోత్సవం



పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): తొమ్మిది రోజులుగా పెజ్జోనిపేట ఆర్సీఎం చర్చిలో జరుగుతున్న మోక్షారోహణ మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం విచారణ గురువు ఫాదర్ జేమ్స్ చెరువత్తూర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దివ్య బలిపూజను సమర్పించారు. సాయంత్రం సంఘస్తులతో కలిసి మేరీమాత ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో బిషప్ సగిలి ప్రకాష్ మాట్లాడుతూ మోక్షారోహణ ద్వారా మరియమాత ఆత్మ శరీరంతో నిత్య జీవంలోకి ప్రవేశించిందన్నారు. కార్యక్రమంలో సహాయక గురువులు ఫాదర్ మాథ్యూస్, శౌరి, జీవన్, సంఘస్తులు పాల్గొన్నారు.